



సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా సాగునీటితోపాటు అవసరమైన చోట తాగునీరు కూడా అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గోదావరిపై ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వేగంగా ప్రాజెక్టు పనులు పూర్తిచేసి ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం చేస్తామని వెల్లడించారు. త్వరలో చైనాలోని షాంఘై కంపెనీ సాంకేతిక నిపుణులను రప్పించి ప్రాజెక్టు పంపుహౌస్‌ల మోటార్లను పరిశీలన (టెస్టింగ్) చేయిస్తామని, ఆ తర్వాతనే ట్రయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు.


ములకలపల్లి మండలంలోని పూసుగూడెం పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, అధికారులు

నా జీవితకాల కోరిక నెరవేరబోతోంది..

- శరవేగంగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు
- త్వరలో పూసుగూడెం, కమలాపురం పంపుహౌస్‌ల ట్రయల్‌రన్
- టెస్టింగ్ కోసం షాంఘై కంపెనీ సాంకేతిక నిపుణులను రప్పించేందుకు ఏర్పాట్లు
- ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం
- ఏన్కూరు లింక్ కెనాల్ పనులు 97 శాతం పూర్తి
- సాగునీటితోపాటు అవసరమైన ప్రాంతాలకు తాగునీరు అందిస్తాం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలు సస్యశ్యామలం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- భద్రాద్రి జిల్లా పూసుగూడెం పంపుహౌస్ పరిశీలన

కొత్తగూడెం/ములకలపల్లి/అన్నపురెడ్డిపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి మండలం పూసుగూడెంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ పంపుహౌస్‌లను మంగళవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పంపుహౌస్‌లో చేపట్టే పనుల వివరాలను మ్యాప్ ద్వారా మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో అమర్చిన మోటార్లను పరిశీలించేందుకు (టెస్టింగ్)కు కేంద్ర ప్రభుత్వం ద్వారా చైనాలో షాంఘై కంపెనీకి చెందిన సాంకేతిక నిపుణులను రప్పించేందుకు చర్చిస్తున్నామని తెలిపారు. ఆ తర్వాతనే ఈ ప్రాజెక్టు పూర్తి ట్రయల్‌రన్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు 97 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు నెలాఖరులోపు పూర్తి చేస్తామన్నారు. జూలూరుపాడు నుంచి ఏన్కూరు వరకు నిర్మిస్తున్న లింక్ కెనాల్ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగుకే కాకుండా ఆయా ప్రాంతాల అవసరాన్ని బట్టి తాగునీటి సదుపాయాన్ని కూడా కల్పిస్తామని మంత్రి వివరించారు.

ఏన్కూరు లింక్ కెనాల్‌లను అత్యవసర ప్రాతిపదికన సీఎం అనుమతితో ఈ నెలలో పూర్తి చేయబోతున్నామని తెలిపారు. జూలూరుపాడు టన్నెల్ వరకు 104కిలోమీటర్ల కెనాల్‌ను 97శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కేవలం మూడుశాతం లైనింగ్ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అవి కూడా ఈ సీజన్ తర్వాత పూర్తి చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టులో సీతారామ ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

వచ్చే సీజన్ నాటికి యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేసి సత్తుపల్లి నియోజకవర్గంతోపాటు అశ్వారావుపేట నియోజకవర్గానికి కూడా నీరు అందిస్తామని తెలిపారు. రూ.7,800కోట్లతో పంపుహౌస్ నిర్మాణం చేపట్టామని జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేసి గోదావరి జలాలను పాలేరుకు చేరుస్తామన్నారు. అక్కడ 10 కిలోమీటర్ల మేర అటవీ అనుమతులు తీసుకొచ్చామన్నారు. సీతారామ ద్వారా ఖమ్మం జిల్లాలో 7 లక్షల ఎకరాలు, నాగార్జునసాగర్ ఆయకట్టు 3లక్షల ఎకరాలు స్థిరీకరణ మొత్తం 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దాంతో తన జీవితకాల కోరిక తీరుతుందని మంత్రి వివరించారు.

అటవీ అనుమతులు లభించకపోవడం వల్ల ఇల్లెందు నియోజకవర్గానికి గోళ్లపాడు నుంచి నీరు అందించడం సాధ్యం కాలేదన్నారు. గోదావరి ఎగువన ఉన్న ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా దుమ్ముగూడెం మండలానికి నీరందించే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇంజనీర్ పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెలలోనే మూడు పంపుహౌస్‌ల ట్రయల్‌రన్ పూర్తి చేస్తామని దీనికోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న అధికారులను మంత్రి అభినందించారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన సమీపంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు కాలువ పనులను పరిశీలించారు. దీంతోపాటు కాలువ ఏర్పాటుకు జాతీయ రహదారిపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మాజీ సీఈ పెంటారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కే.సురేష్‌కుమార్, ఇతర ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ శాఖాధికారులతో మంత్రి సమావేశమై ఈ ప్రాజెక్టు నిర్మాణంపై కొద్దిసేపు సమీక్షించారు. ఈ ప్రాజెక్టు నీటిని త్వరలో విడుదల చేయిస్తున్న సందర్భంగా ఇంజనీరింగ్ నీటిపారుదల శాఖాధికారులు అప్రమత్తంగా ఉండి నిర్మాణ పనులు పూర్తి చేయాలని మంత్రి వారికి సూచించారు.



టార్గెట్ ఆగస్టు 15

- 'సీతారామ' రెండు, మూడు దశల పంపుహౌస్‌ల ట్రయల్‌రన్‌కు సన్నాహాలు
- చైనా నుంచి నిపుణుల బృందాన్ని రప్పించేందుకు చర్యలు
- మొదటి దశలో ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు
- ప్రత్యేక చొరవ తీసుకుంటున్న మంత్రి తుమ్మల

7



నేడు కేబినెట్ సబ్ కమిటీ రాక

- రైతు భరోసాపై ఖమ్మం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్
- పాల్గొననున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి

ఖమ్మం, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం సీజన్‌లో రైతు భరోసా పథకం అమలు కోసం విధి విధానాల రూపకల్పనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రి మండలి సబ్ కమిటీ బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరు కానున్నారు. ఈ వర్క్‌షాప్‌లో రైతుభరోసా పథకం ద్వారా అందించనున్న రూ.15వేల సాగు సాయాన్ని ఏ పద్ధతిలో అందించాలన్న అంశంపై రైతులు, రైతుసంఘాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఐదు పైలెట్ జిల్లాలను ఎంపికచేసి నిరుపయోగంగా ఉంటున్న భూములపై సర్వే నిర్వహించింది. అందులో ఖమ్మం, హనుమకొండ, కరీంనగర్, సంగారెడ్డి కామారెడ్డి జిల్లాల్లో సర్వే నెంబర్లు ఉండి ఎలాంటి సాగు చేయకుండా కొన్నేళ్లపాటు ఖాళీగా ఉంటున్న భూముల వివరాలపై సర్వే కూడా నిర్వహించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన రైతుబంధు కింద ఖాళీగా ఉన్న భూములకు, గుట్టలకు, బీళ్లకు, ప్రభుత్వం పలు అభివృద్ధి పనుల కింద సేకరించిన భూములకు సైతం పాసు పుస్తకాల ఆధారంగా రైతుబంధు అందించడంతో ఈ పథకంలో కొంత సొమ్ము దుబారా అయిందన్న విమర్శ ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకాన్ని రైతు భరోసాగా మార్చి ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఈ సొమ్ము ఎలాంటి రైతులకు ఇవ్వాలి, ఏ పద్ధతిలో ఇవ్వాలనే దానిపై రైతులు, రైతు సంఘాల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని తద్వారా రైతు భరోసా పథకం అమలు చేసేందుకు ఈ సబ్ కమిటీని నియమించగా బుధవారం ఖమ్మంలో నిర్వహించనున్న వర్క్‌షాపులో రైతులు, రైతుసంఘాల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

- పాలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

కూసుమంచి, జూలై 9: రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 10:30గంటలకు ఛాపర్ ద్వారా నేరుగా ఖమ్మం చేరుకుని కలెక్టరేట్‌లో రైతు భరోసాపై జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. అనంతరం 3 నుంచి 6 గంటల వరకు పాలేరు నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. కూసుమంచి మండలం పోచారంలో, నాయకన్‌గూడెం గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈశ్వరమాధారం గ్రామంలో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభిస్తారు. అదేవిధంగా ఈశ్వరమాధారం తాజా, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి తండ్రి ఇటీవల అనారోగ్యంతో చనిపోగా ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తారు. అక్కడినుంచి సాయంత్రం 5:30గంటలకు తిరుమలాయపాలెం మండలంలో రాకాసితండావద్ద చెక్‌డ్యామ్, హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభిస్తారు.

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

- రూ.4.8 కోట్లు వసూలు చేసిన ముఠాలో మరొకరి అరెస్టు
- గతంలోనే 9 మంది అరెస్టు... పరారీలో మరో ముగ్గురు
- నిందితుల నుంచి రూ.1.47కోట్ల నగదు స్వాధీనం

6



డెంగ్యూతో డాక్టర్ మృతి

ధంసలాపురం వద్ద ఎగ్జిట్ మంజూరు

- రూ.70 కోట్లతో రహదారి నిర్మాణం
- ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో మరో సౌలభ్యం
- మంత్రి తుమ్మల చొరవతో పరిష్కారం

6

రాలిపోతున్నరమ్మా..

- ప్రాణాలకు ముప్పు తెస్తున్న భూవివాదాలు
- సకాలంలో స్పందించని సంబంధిత అధికారులు
- పలు శాఖల సమన్వయ లోపమే కారణం
- జిల్లాలో కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యాయత్నాలు

6

రామయ్య భూములపై సర్కార్ నజర్

- పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్‌లో సమావేశం
- సీఎం రేవంత్‌కు విన్నవించిన తర్వాత కార్యాచరణ
- నేడు భద్రాద్రికి రానున్న దేవాదాయశాఖ కమిషనర్


రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలు (ఫైల్)

భద్రాచలం, జూలై 9: ఏపీలోని భద్రాద్రి రామయ్య భూముల పరిరక్షణపై రాష్ట్ర దేవాదాయ శాఖ దృష్టి సారించనుంది. గత ఐదేళ్లుగా ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి భూముల్లో తరుచూ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు జరుగుతున్నాయి. ఈ విషయంపై ఏపీలోని సంబంధిత అధికారులకు పలుమార్లు లిఖితపూర్వక ఫిర్యాదులు చేసినా ఎటువంటి స్పందన లేదు. తాజాగా శ్రీగోకుల రామం ఎదురుగా అక్రమ నిర్మాణం చేపడుతుండగా దేవస్థానం అధికారులు దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో రామయ్య భూములకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించేదుకు దేవాదాయశాఖ సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవితో పాటు ఇతర అధికారులు సమావేశమయ్యారు. రామయ్య భూముల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఈ విషయాన్ని నివేదించి రెండు రాష్ట్రాల సీఎంల ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేలా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పురుషోత్తపట్నంలో భద్రాద్రి రామయ్యకు 890ఎకరాల భూమి ఉండగా అందులో 650ఎకరాలకు పైగా ఆక్రమణలోనే ఉన్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా పురుషోత్తపట్నంలోని భూములు భద్రాద్రి రామయ్యకే చెందుతాయని గతంలో ఏపీ హైకోర్టు కూడా తీర్పు వెల్లడించిన విషయాన్ని దేవస్థానం అధికారులు గుర్తు చేశారు. రెండు రాష్ట్రాల సీఎంలు భద్రాద్రి రామయ్య భూములపై నిర్ణయం తీసుకుంటే తద్వారా భవిష్యత్‌లో ఎటువంటి సమస్య తలెత్తే అవకాశం ఉండదని దేవస్థానం వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందిస్తున్న మాస్టర్‌ప్లాన్‌పై సైతం ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ఆధ్యాత్మికతకు, సంప్రదాయానికి, పురాతన నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా భక్తులు మెచ్చే రీతిలో మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు భద్రాచలం రానున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన భద్రాద్రి మాస్టర్‌ప్లాన్‌పై క్షేత్రస్థాయిలో స్థానిక అధికారులతో కలిసి పరిశీలించడంతోపాటు పురుషోత్తపట్నంలోని రామయ్య భూములను సైతం పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.

చెల్లీ.. బుజ్జీ.. అంటూ ట్రాప్ చేశాడు!

- వివాహిత యువతి కుటుంబంలో ఏఆర్ కానిస్టేబుల్ చిచ్చు
- భార్య, ముగ్గురు పిల్లలను వదిలి వివాహేతర సంబంధం
- ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులను బజారుకీడ్చిన ఘనుడు
- తన భార్యను తనకు కాకుండా చేస్తున్నాడని.. పోలీసులను ఆశ్రయించిన భర్త
- ఏఆర్ కానిస్టేబుల్ నుంచి ప్రాణభయం ఉందని ఫిర్యాదు
- వెంటనే విచారణ జరపాలని సీపీ సునీల్‌దత్ ఆదేశం



ఖమ్మం క్రైం, జూలై 9: కులాలు వేరైనా వారిద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలను కాదని వివాహం చేసుకున్నారు. దాంపత్య జీవితంలో వారికి ఇద్దరు పిల్లలు కలిగారు. ఉన్న దాంట్లో అన్యోన్యంగా జీవితం గడుపుతున్నారు. ఈ క్రమంలో ఆమెపై ఓ కామాంధుడి కన్ను పడింది. పెళ్లయి ముగ్గురు పిల్లలున్నా.. ఆ కామాంధుడు యువతి వెంటపడ్డాడు. అతడు సాదాసీదా వ్యక్తి కాదు.. చట్టాన్ని కాపాడాల్సిన కానిస్టేబుల్. కానీ బుద్ధి గడ్డితిని తప్పుదోవ పట్టాడు. ఒక ప్లాన్ ప్రకారం చెల్లీ అంటూ వరుస కలుపుకొని 'నీకు మంచి పర్సనాలిటీ ఉంది.. ప్రయత్నిస్తే కానిస్టేబుల్ ఉద్యోగం వస్తుంది.. నీకు సాయం చేస్తా..' అంటూ నమ్మించాడు. పనిలో పనిగా ఆమె భర్తనూ నమ్మించాడు. చెల్లీ అంటున్నాడు కదా.. అని ఇద్దరూ చనువుగా ఉంటున్నప్పటికీ భర్త అనుమానపడలేదు. కానీ ఆ తర్వాత సీన్ మారింది. కానిస్టేబుల్‌లోని కామాంధుడు బయటకు వచ్చాడు. చెల్లీ అని పిలిచిన యువతినే ట్రాప్ చేశాడు. మాయమాటలతో తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. భర్తతో సంసారానికి దూరం చేశాడు. ఈ క్రమంలో దిక్కుతోచని యువతి భర్త.. న్యాయం కోరుతూ పోలీసులను ఆశ్రయించాడు. మాయమాటలతో తన కుటుంబంలో చిచ్చు రేపిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని మొరపెట్టుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే...

ఖమ్మం నగర శివారులోని ఓ ప్రాంతానికి చెందిన యువకుడు కొంతకాలం క్రితం తాను నివాసం ఉంటున్న సమీప ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించి పెద్దలు ఒప్పుకోకపోయినా వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత కుటుంబ సభ్యులు కలవడంతో ఇద్దరూ అన్యోన్యంగా ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఇటీవల ఇంటి పక్కన జరిగిన ఓ ఘటన విషయమై భార్యతో కలిసి (మిగతా 6వ పేజీలో)


సత్తుపల్లి మండలం బేతుపల్లి-సత్యనారాయణపురం మధ్య నీటమునిగిన వరిపొలాలు

వరిపొలాలను ముంచెత్తిన వరద

- సత్తుపల్లిలో నీటమునిగిన 200 ఎకరాల వరి
- బేతుపల్లి-సత్యనారాయణపురం మధ్య పోటెత్తిన వరద

సత్తుపల్లిరూరల్, జూలై 9: భారీ వర్షాలతో సత్తుపల్లి మండలంలో మంగళవారం వరద పొంగింది. భారీ వరదతో వరి నారుమడులు నీటమునగగా ఇళ్లలోకి వరదనీరు చేరింది. మండలంలోని బేతుపల్లి-నారాయణపురం వరి పొలాల మీదుగా పాకలగూడెం, ఆపై సత్యనారాయణం గ్రామాల వరకు పంటపొలాలు వరదనీటితో నిండిపోయాయి. సత్తుపల్లి మండలంలో ఓ మోస్తారుగా వర్షం కురవగా సత్యనారాయపురంతోపాటు ఆంధ్రాలోని చింతంపల్లి, తదితర గ్రామాల్లో భారీవర్షం కురిసినట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. దీంతో అటునుంచి వరద మొత్తం రాళ్లగండి వాగు ద్వారా సత్తుపల్లి మండలాన్ని ముంచింది. దీంతో వరి మడులతో పాటు అరటి, పామాయిల్ తోటలు నీటమునగగా సుమారు 200 ఎకరాలకు పైగా వరిమడులు వరదనీటితో నిండిపోయాయి.

ప్రేమ పేరుతో వెంటపడి...

- బాలికను గర్భవతిని చేసిన యువకుడు
- బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

6



భట్టికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

మధిర టౌన్, జూలై 9: విజయవాడలోని ఇంద్రకీలాద్రి పై ఉన్న దుర్గమ్మను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. మంగళగిరిలోని సి-కన్వెన్షన్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఇద్దరు మంత్రులు... రాత్రి విజయవాడలో బస చేశారు. ఉదయాన్నే దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకునేందుకు వెళ్లిన మంత్రులకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అమ్మ వారి చిత్రపటాన్ని ఉప ముఖ్యమంత్రికి బహూకరించారు.

ప్రేమ పేరుతో వెంటపడి...

- బాలికను గర్భవతిని చేసిన యువకుడు
- బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

చంద్రుగొండ, జూలై 9: ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటాను అంటూ బాలిక వెంటబడి ఆపై గర్భవతిని చేసిన యువకుడిపై మంగళవారం కేసు నమోదైంది. ఈ ఘటనపై చంద్రుగొండ ఎస్‌ఐ మాచినేని రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ శివారు ఇమ్మడి రామయ్య బంజర్ గ్రామానికి చెందిన కంపసాటి రవి అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలికను ప్రేమ పేరుతో వేధించాడు. పెళ్లి చేసుకుంటాను అంటూ కొంతకాలంగా వెంట తిరిగాడు. నిందితుడి సోదరి, బాధిత బాలిక స్నేహితులు కావటంతో దీన్ని ఆసరాగా చేసుకొని రవి తన సోదరితో కలిసి అప్పుడప్పుడు బాధిత యువతి ఇంటికి వెళ్లేవాడు.

మే 1న బాలిక ఇంట్లో ఒంటరిగా ఉందని తెలుసుకొని రవి తన సోదరితో కలిసి ఆమె ఇంటికి వెళ్లాడు. కొంతసేపు మాట్లాడాక నిందితుడు రవి సోదరి బయటకు వెళ్లి తలుపు గడియ పెట్టింది. ఈ సమయంలో రవి ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వీడియో తీశానని, సోషల్ మీడియాలో పెడతానని రవి బాలికను బెదిరించటంతో జరిగిన సంఘటనను తల్లిదండ్రులకు చెప్పలేదు. ఆమె ఇటీవల కడుపులో నొప్పి అని చెప్పటంతో కొత్తగూడెం ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా గర్భవతి అని తెలిసింది. వేధింపుల విషయం రవి తల్లిదండ్రులకు తెలిసి కూడా రవిని అదుపులో పెట్టకపోగా ప్రోత్సహించారని, సోదరి సహకరించిందని బాధితరాలి తల్లి ఫిర్యాదు చేయటంతో నలుగురిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశామని, జూలూరుపాడు సీఐ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని ఎస్‌ఐ రవి వివరించారు.

సమయాన్ని పాటించని ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

కరకగూడెం, జూలై 9: మారుమూల మన్యం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులు సమయపాలనను పట్టించుకోవడం పలు గ్రామాల బడులపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు ఉపాధ్యాయులకు ఆడిందే ఆటగా పాడిందే పాటగా సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రాథమిక పాఠశాలకు ఉదయం 9గంటలకు ఉపాధ్యాయులు రావాలి. సాయంత్రం 4గంటలకు పాఠశాలను ముగించి వెళ్లాలి. మంగళవారం మోతె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు 9గంటలు దాటినా ఇంకా పాఠశాలకు రాలేదు. పలువురు ఉపాధ్యాయులు 9గంటల సమయం దాటిన నెమ్మదిగా 9:30 గంటలకు వస్తున్నారు. సాయంత్రం 3:30 సమయం దాటంగానే ఇంటి దారి పడుతున్నారు. మండలంలోని ఉపాధ్యాయులు మండల కేంద్రంలోనే విధిగా నివాసం ఉండాలి. కాని కొందరు ఉపాధ్యాయులు ఇల్లెంద, బంజర, భద్రాచలం, పాల్వంచ, మణుగూరు నుంచి రాక పోకలు సాగిస్తున్నారు.



వ్యవసాయసీజన్ మొదలుకావడంతో రైతులు పొలాలు దుక్కులు చేయడం, శుభ్రం చేసుకోవడం, మట్టి పనులు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో జిల్లాలో భూవివాదాలు పెరుగుతున్నాయి. చెరువు శిఖం భూములు, గెట్టు సరిహద్దులు, భూఆక్రమణలు వంటి వివాదాలు రైతుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నాయి. రైతులమధ్య ఏర్పడుతున్న ఘర్షణలు, తగాదాలు, దీని వెనుక ఉండే గ్రామ రాజకీయాలు రైతులను క్షణికావేశానికి గురిచేస్తున్నాయి. అధికారుల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాల్సిన రైతులు అధికారులతో పనులు కావన్న ఆవేదనతో పురుగులమందు తాగి ఆత్మహత్యలకు దిగుతున్నారు. ఈ తరహా ఘటనలు ఇటీవల వరుసగా వెలుగుచూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

- ప్రాణాలకు ముప్పు తెస్తున్న భూవివాదాలు
- సకాలంలో స్పందించని సంబంధిత అధికారులు
- పలు శాఖల సమన్వయలోపమే కారణం
- జిల్లాలో కొనసాగుతున్న రైతు ఆత్మహత్యాయత్నాలు

రాలిపోతున్నరమ్మా..



ఖమ్మం, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యక్తిగత పొలం ఘర్షణలు రాజకీయపార్టీలకు సైతం పరీక్షగా మారుతున్నాయి. ఎవరి వైపు వెళ్లినా మరొకరి వైపు ప్రత్యర్థి పార్టీలు లేక అధికారులు పార్టీలను ఆశ్రయించడంతో ఈవివాదాలు రాజకీయ వివాదంగా మారుతున్నాయి. పెద్దమనుషులుగా వెళుతున్నవారు సైతం కేసుల్లో ఇరుక్కునే పరిస్థితులు తలెత్తుతున్నాయి. అధికారయంత్రాంగం స్థానికంగా సకాలంలో స్పందించకపోవడంతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. మండలస్థాయిలో పరిష్కారం కావల్సిన భూవివాదాలు తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం కావడం లేదు. దీంతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రాలు ఇచ్చే పరిస్థితి కనిపిస్తుంది.

● ఇటీవల చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన బొజెడ్ల ప్రభాకర్ అనే రైతు తనకున్న ఏడున్నర ఎకరాలలో మూడున్నర ఎకరాలు చెరువు శిఖానికి సమీపంలో ఉండడంతో చెరువు సొసైటీ సభ్యులకు, రైతుకు మధ్య భూవివాదం తలెత్తింది. తన భూమిని పొక్లెయిన్ ద్వారా తవ్వించారని న్యాయం చేయాలని, తహసీల్దార్, పోలీసుస్టేషన్‌కు వెళ్లినా పరిష్కారం ఫలించలేదు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లినా సత్వర న్యాయం జరగలేదన్న ఆవేదనతో రైతు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది.

రైతు వీడియో ద్వారా తనకు జరిగిన అన్యాయాన్ని సెల్ వీడియో ద్వారా వివరిస్తే అందుకు కారకుల పేర్లు తెలుపుతూ రికార్డు చేసి పురుగులమందుతాగి ఆత్మహత్య చేసుకోవడం, ఇందులో కొందరిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు. వాస్తవానికి రైతు ఫిర్యాదు చేసిన వెంటనే రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే విభాగం అధికారులు స్పందించి సర్వే చేపట్టి హద్దులు నిర్ణయిస్తే రైతు ప్రాణం తీసుకునే పరిస్థితి ఉండేది కాదు. కాగా రైతు ఆవేదనతో ఉన్న రైతుకు మనోధైర్యం చెప్పాల్సిన నాయకులు కూడా ఆయనకు సహకారం ఇవ్వకపోగా కొందరు ఆయన బాధను వీడియోలో చిత్రీకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణలో వాస్తవాలు తేలనున్నాయి.

● కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో పచ్చిపాల భద్రయ్య అనే రైతు తన ఎకరం 20కుంటల భూమి ఎన్నో ఏళ్లగా పహణీలో ఉండా వేరే వ్యక్తులు తమదని ఆక్రమించుకుంటున్నారని, ఆవేదనతో పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. దీంతో ఆయన ప్రస్తుతం ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈభూమిపై చాలా కాలంగా వివాదం ఉంది. కానీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితి తెలుసుకుని న్యాయం చేయల్సి ఉంది.

● ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన మేడి సీతయ్య అనే రైతు తనకున్న 5.30 ఎకరాల భూమి చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ పురుగుమందుతాగి ఆత్మహత్యయత్నం చేశాడు. ఆయణ్ను ఖమ్మం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందతున్నాడు. ఇలా వరుసగా భూవివాదాల్లో రైతులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

సత్వర సమీక్ష అవసరం..

గట్టుతగాదాలు, పొలాలకు దారులు, సర్వేనెంబర్ల మార్పు, ధరణిలో సమస్యలు కూడా పరిష్కారం కాక రైతులు ఆవేదనకు గురవుతున్నారు. కలెక్టరేట్‌కు తహసీల్దార్ కార్యాలయాలకు తిరిగి అలిసిపోతున్నారు. ప్రజాప్రతినిధులు కూడా ఎమ్మెల్యేల స్థాయిలో గ్రామాల్లో భూవివాదాలపై ఫిర్యాదులపై ధరణి సమస్యలపైనా రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, వ్యవసాయం, తదితర శాఖలతో సమీక్ష చేస్తే కొంత వరకు రైతులకు సత్వర న్యాయం జరిగే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు కూడా భూసమస్యలపైన చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

సమన్వయం ప్రధానం

జిల్లాలో ఫిర్యాదుల వచ్చిన చోట రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ అధికారులు సత్వరం స్పందించి క్షేత్రస్థాయిలో సర్వే నిరహించి హద్దులు నిర్ణయిస్తే వివాదాలు ఉండే అవకాశం ఉండదు. రైతులు ఫిర్యాదు చేసినా సర్వేకు పెట్టుకున్నా నెలలతరబడి వేచి ఉండాల్సిందే. ముడుపులు ఇస్తేనే రెవెన్యూ, సర్వే అధికారులు క్షేత్రస్థాయికవెళ్లడం, డబ్బులు ఇచ్చినవారికి అనకూలంగా వ్యవహరించడం, రాజకీయ సిఫారసులకు తలొగ్గటం వల్ల తమకు న్యాయం జరగదన్న భావన ఫిర్యాదుదారులకు కలుగుతుంది. ఇరువర్గాలను సామరస్య పరిచి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసుయంత్రాంగం సమన్వయంతో వ్యవహరిస్తే కొంత వరకు సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉండదు.

అధికారులు సత్వరం స్పందిస్తేనే...

జిల్లాలో ఇటీవల కాలంగా భూవివాదాలు పెరుగుతున్నాయి. రైతుల మధ్య, వారసుల మధ్య పెరుగుతున్న ధరలతోపాటు భూవివాదాలు కూడా అదేస్థాయిలో ఉన్నాయి. చెరువు శిఖాల సమీపంలోని భూములకు పాసుపుస్తకాలున్నా చేపల పెంపకందారులకు, రైతులకు మధ్య కూడా ఘర్షణలే ఏర్పడుతున్నాయి. చేపలు పెరుగాలంటే నీరు నిల్వ ఉండాలంటే ఎత్తయిన కట్టలు వేయడం ద్వారా సాధ్యమవుతుంది. వర్షం వస్తే నీరు పెరిగి పొలం పోతుందని రైతులు తమ లోతట్టు పొలాన్ని ఎత్తుగా చేసుకుంటున్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి.

వన మహోత్సవానికి ప్రత్యేక కార్యాచరణ

- పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు
- వ్యాధుల నియంత్రణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- సీఎస్ వీడియో కాన్ఫరెన్సులో స్పష్టీకరణ
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 9: వన మహోత్సవం కింద జిల్లాలో మొక్కలు నాటుతున్నట్లు, నేషనల్ హైవే, కెనాల్ బండ్ ల వద్ద మొక్కలు నాటడానికి ప్రత్యేక కార్యాచరణ చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్‌లు డి. మధుసూదన్ నాయక్, సన్యాసయ్యతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడారు.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల కింద జిల్లాలో 50 పాఠశాలలు గుర్తించి మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. వారంలోగా లక్ష్యం మేరకు మొక్కలు నాటడం పూర్తి చేయనున్నట్లు ఆయన అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌ల తర్వాత మాల్‌లతో టై అప్ చేసి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగంగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కు హాట్ స్పాట్ లు గుర్తించి ముందస్తుగా కట్టడి చేస్తున్నట్లు తెలిపారు. మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేసినట్లు ఆయన అన్నారు. ఉద్యోగుల బదిలీలు నిబంధనల మేరకు పారదర్శకంగా చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ఎస్. వినోద్, సీపీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మాలతి, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా ఇరిగేషన్ అధికారి వెంకట్రాం, పీఆర్ ఈఈ వెంకట్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

- రూ.4.8 కోట్లు వసూలు చేసిన ముఠాలో మరొకరి అరెస్టు
- గతంలోనే 9 మంది అరెస్టు... పరారీలో మరో ముగ్గురు
- నిందితుల నుంచి రూ.1.47కోట్ల నగదు స్వాధీనం
- మోసగాళ్ల బారిన పడవద్దు: భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థతో పాటు గ్రూప్-2లో ఏసీటీవో స్థాయి ఉద్యోగాలు ఇప్పిస్తామని, వివిధ ప్రభుత్వశాఖల్లో ఉద్యోగులను బదిలీ చేయిస్తామని మాయమాటలు చెప్పి సుమారు 60 మంది నుంచి రూ.4.8కోట్లు వసూలు చేసిన ఘరానా ముఠాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం 13 మంది నిందితులు ఉండగా వారిలో 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.47కోట్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళవారం కొత్తగూడెంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కొంతమంది వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేశారని గతేడాది మేలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లాలోని చుంచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా దాసు హరికిషన్, గుండా వినోద్‌కుమార్, ఉపేంద్రనాయుడు అనే వారి ఆధ్వర్యంలో వసూళ్లకు పాల్పడినట్లు తేలిందని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో గతంలోనే 9 మందిని అరెస్టు చేయగా మరో నిందితురాలైన దాసు హారికను మంగళవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. మొత్తం 13 మంది నిందితులు 2018నుంచి సింగరేణి సంస్థలో జూనియర్ అసిస్టెంట్, క్లర్క్, డిపెండెంట్ జాబ్స్, గ్రూప్-2లో పోస్టులు ఇప్పిస్తామని, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయిస్తామని మాయమాటలు చెప్పి పలువురిని మోసగించారని తెలిపారు.

కొత్తగూడెం జిల్లాలో ఈ నిందితులపై పలు పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వీరు నిరుద్యోగుల నుంచి రూ.4కోట్ల 8లక్షలు వసూలు చేసినట్లు తేలిందన్నారు. అరెస్టయిన నిందితులనుంచి ఇప్పటివరకు రూ.1.47కోట్ల నగదుతో పాటు నాలుగు తులాల బంగారు ఆభరణాలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వసూళ్లకు పాల్పడిన డబ్బుతో కొనుగోలు చేసిన సుమారు 92.5 తులాల బంగారు ఆభరణాలను మళ్లీ బ్యాంకులో తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నట్టు నిందితులు తెలిపారని ఎస్పీ వివరించారు. వాటిని కూడా వీలైనంత త్వరగా చట్టప్రకారం స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ వివరించారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులైన రుహత్‌బేగ్, ఉపేందర్‌నాయుడు, రవిరాజులను కూడా త్వరలో పట్టుకుంటామన్నారు.

ఈ కేసులో నిందితులను పట్టుకుని విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూసిన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి ఎస్‌ఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ప్రవీణ్‌తోపాటు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. నిరుద్యోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఇలాంటి వారు చాలా మంది ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తూ సమాజంలో తిరుగుతున్నారని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ధంసలాపురం వద్ద ఎగ్జిట్ మంజూరు

- రూ.70 కోట్లతో రహదారి నిర్మాణం
- ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో మరో సౌలభ్యం
- మంత్రి తుమ్మల చొరవతో పరిష్కారం

ఖమ్మం, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే జాతీయ రహదారి నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మం పట్టణ, జిల్లా ప్రజలకు బోనకల్ రోడ్డులోని ధంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రాకపోకలు నేరుగా ఉండేందుకు ఎగ్జిట్ ఏర్పాటు చేసేందుకు నేషనల్ హైవే అథారిటీ అంగీకరించింది. రూ.70కోట్లతో ధంసలాపురంవద్ద బోనకల్ రహదారితోపాటు ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారిని అనుసంధానం చేస్తూ నిర్మించబోతున్నారు. దీనికి రెండు డిజైన్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. హైవేకు సమాంతరంగా రహదారి నిర్మించడం లేదా మలుపులతో కూడిన రహదారి నిర్మించి ఎగ్జిట్ ఏర్పాటు చేయడం రెండు ప్రతిపాదనల్లో ఏది తక్కువ ఖర్చుతో సౌలభ్యంగా ఉంటే ఆ డిజైన్ పద్ధతిలో నిర్మించబోతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంగళవారం హైదరాబాద్‌లో నేషనల్ హైవే అథారిటీ ఢిల్లీ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మం జిల్లా నుంచి కూడా నేషనల్ హైవే అధికారులు వెళ్లి ధంసలాపురం ఎగ్జిట్ అవసరాన్ని వివరించారు.

ఖమ్మం-మధిరను అనుసంధానం చేసేలా బోనకల్ రహదారిపై ధంసలాపురం వద్ద ఎగ్జిట్ ఆవశ్యకతను తెలపడంతో భూసేకరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేలా రహదారి నిర్మాణం నేషనల్ హైవే అథారిటీ నిర్మించేలా అంగీకారం కుదిరినట్టు తెలిసింది. ధంసలాపురం వద్ద ఎగ్జిట్ మంజూరయిందని, తద్వారా ఖమ్మం పట్టణ ప్రజలకు, బోనకల్ రహదారి నుంచి ధంసలాపురం వద్ద ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పైకి రాకపోకలు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని మంత్రి తుమ్మల తెలిపారు.

ఖమ్మం చుట్టూ జాతీయ రహదారుల అనుసంధానం కావడంతో నేషనల్ హైవే రహదారులతో రింగ్‌రోడ్డు నాలుగువైపులా రాబోతుందని, కొంత గ్యాప్ 8 కి.మీ. ప్రత్యేకంగా నిర్మించబోతున్నామని, తుమ్మల వివరించారు. రింగ్ రోడ్డు ఏర్పాటయితే ఖమ్మం పట్టణంలో ఫ్రీ ట్రాఫిక్ ఉంటుందని, ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ ఖమ్మంలోకి రాకుండానే నేషనల్ హైవే ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కోదాడ, ఖమ్మం-కురవి, అమరావతి-నాగపూర్ రహదారులతో రాకపోకలు సాగుతాయని మంత్రి తుమ్మల వివరించారు.

చెల్లీ.. బుజ్జీ.. అంటూ ట్రాప్ చేశాడు!

(5వ పేజీ తరువాయి)

నగరంలోని ఓ పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. అక్కడకు పనిపై వచ్చిన ఓ ఎఆర్ కానిస్టేబుల్ సదరు వివాహితను చూసి ఆమెతో బుజ్జీ, చెల్లీ అంటూ మాటలు కలిపాడు.

'బుజ్జీ నువ్వు కానిస్టేబుల్ ఉద్యోగానికి సరిపోతావు.. ఒక్కసారి ప్రయత్నించు.... ఏదైనా అవసరం ఉంటే నేను సాయం చేస్తా..' అంటూ వివాహితను, ఆమె భర్తను నమ్మించాడు. దీంతో పాటు 'నేను ఒక సైడ్ బిజినెస్ చేస్తున్నా.. నీవు కూడా చేరితే నెలకు రూ.60వేల వరకు సంపాదించవచ్చు..' అని చెప్పాడు. ఆ తర్వాత సదరు కానిస్టేబుల్ ఆమెకు దగ్గరవుతూ వచ్చాడు. చెల్లీ.. అంటున్నాడు కదా.. అని భర్త కూడా వారిని అనుమానించలేదు.

కొద్దిరోజుల తర్వాత ఇల్లెందులో బిజినెస్ మీటింగ్ ఉందంటూ సదరు వివాహితను కానిస్టేబుల్ కారులో తీసుకెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ, వచ్చిన దగ్గర నుండి సదరు వివాహిత భర్తకు దూరంగా ఉండటం మొదలుపెట్టింది. అనుమానం వచ్చిన భర్త ఏమైందని పలుమార్లు అడిగినా ఏమీ చెప్పలేదు. ఈ క్రమంలో ఆమె రహస్యంగా వాడుతున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి చెక్ చేయగా, దానిలో కానిస్టేబుల్‌తో తన భార్య అశ్లీలంగా వున్న ఫోటోలు కనిపించడంతో షాక్ తిన్నాడు. భార్యను నిలదీసినా ఆమె సమాధానం చెప్పలేదు. తన భార్య పూర్తిగా కానిస్టేబుల్ ట్రాప్‌లో పడిపోయినట్టు గుర్తించాడు. పచ్చగా వున్న సంసారంలో కానిస్టేబుల్ నిప్పులు పోశాడని, తనకిక చావే శరణ్యమని డిప్రెషన్‌లో పడిపోయాడు. ఇదంతా గమనించిన బంధువు ఒకరు అతడిని తీసుకొని మంగళవారం పోలీసుకమిషనర్ సునిల్‌దత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో సీపీ వెంటనే స్పందించి విచారణ చేయాలని నగరంలోని ఓ పోలీసుస్టేషన్ అధికారికి ఆదేశాలు జారీచేశారు.

నాకు ప్రాణహాని ఉంది...

భార్య ప్రవర్తనలో మార్పు కనిపించడంతో తాను నిఘా పెట్టానని భర్త తెలిపాడు. ఇదే విషయమై నెలరోజుల క్రితం ఇంటిలో గొడవ జరగగా, తన భార్య విపరీతంగా ప్రవర్తించిందని తెలిపాడు. వంటగదిలో ఫోన్‌లో మాట్లాడుతున్న మాటలను తాను రహస్యంగా విన్నప్పుడు తన భార్య కానిస్టేబుల్‌తో కలిసి తనను చంపేందుకు ప్లాన్ వేస్తున్నట్టు అర్థమైందని తెలిపాడు. దీంతో ప్లాన్ ప్రకారం ఆమె ఫోన్‌లోని సాక్ష్యాలను పట్టుకున్నట్టు తెలిపాడు. కాగా, ఇద్దరి బండారం తనకు తెలియడంతో కానిస్టేబుల్ బెదిరింపులకు దిగుతున్నాడని యువకుడు తెలిపాడు. ఫిర్యాదు చేసి కేసుపెట్టినా తనకేమీ కాదని, జైలుకు వెళ్లి బయటకు వచ్చిన తర్వాత అంతు చూస్తానని పలువురి వద్ద చెబుతున్నాడని యువకుడు తెలిపాడు. సదరు కానిస్టేబుల్ నుంచి తనకు ప్రాణహాని ఉందని పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరాడు.

భార్య, ముగ్గురు పిల్లలను వదిలేసి...

ప్లాన్ ప్రకారం యువతిని ట్రాప్ చేసి వాడుకుంటున్న ఎఆర్ కానిస్టేబుల్ తీరు విస్తు గొలుపుతోంది. ఇతనికి ఇప్పటికే పెళ్లయి ముగ్గురు పిల్లలు కూడా వున్నారు. కొంతకాలం క్రితమే భార్యా పిల్లలను వదిలేసి ఖమ్మంలో ఒంటరిగా వుంటున్నాడు. ఈ ఘనుడు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లో పనిచేస్తున్నట్టు తెలిసింది. ఇతనిపై భార్య ఫిర్యాదు చేయగా, పోలీసు అధికారి ఒకరు పిలిచి మందలించినా ఎటువంటి మార్పు రాలేదు. భార్యను, పిల్లలను వదిలేయడమే కాకుండా, వివాహేతర సంబంధం పెట్టుకున్న యువతి పేరును తన గుండెపై పచ్చబొట్టును వేయించుకున్నట్టు తెలిసింది.

డెంగ్యూతో డాక్టర్ మృతి

మణుగూరు, జూలై 9: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ వైద్యుడు డెంగ్యూతో మృతి చెందాడు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఏఐటీయూసీ నాయకుడిగా, కొండాపురం మైనింగ్ సర్దార్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన అంజయ్య కుమారుడు నాగరపు దిలీప్(37) డెంగ్యూతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. గతంలో మణుగూరులోని పీవీ కాలనీలో నివాసమున్న దిలీప్ విద్యాభ్యాసం అంతా మణుగూరులోనే సాగింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తరువాత కొంత కాలంగా ఆయన హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ఆయన తండ్రి అంజయ్య పదవీ విరమణ పొందిన తర్వాత ఖమ్మంలో స్థిరపడ్డారు. దిలీప్‌కు జ్వరం రావడంతో ముందుగా సాధారణ జ్వరంగా భావించి చికిత్స పొందినా తగ్గకపోవడంతో పరీక్షలు నిర్వహించడంతో డెంగ్యూ జ్వరమని నిర్ధారణ అయ్యే సరికే ఆయన పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని మంగళవారం ఖమ్మం తరలించగా మణుగూరు నుంచి ఏఐటీయూసీ నాయకులు రాంగోపాల్, రామనర్సయ్య, నాగరాజు, ఈశ్వర్‌లతో పాటు బ్రాంచ్ కమిటీ సభ్యులు ఖమ్మం చేరుకుని దిలీప్ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూ సేకరణ సత్వరమే పూర్తిచేయాలి..

- భూములిచ్చిన వారికి ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం
- సీతారామ ప్రాజెక్టు రెండో దశపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జూలై 9: సీతారామ ప్రాజెక్టు రెండో దశ (స్టేజ్ 2) పూర్తికి భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయన సీతారామ ప్రాజెక్టు స్టేజ్ 2 పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టు, ఎస్సెస్పీ లింక్ కెనాల్‌కు ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయి, ఎగ్జిక్యూటివ్ పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. ప్రాజెక్టు పూర్తికి మిగిలిన భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇంకా భూసేకరణ చేయాల్సిన రైతులతో చర్చలు నిర్వహించి వారితో అంగీకారాన్ని తీసుకోవాలన్నారు. కాల్వ ఏర్పాటుతో రైతుల భూముల విలువ పెరుగుతుందని అవగాహన కల్పించాలన్నారు. 75శాతం కంటే ఎక్కువ భూమిని కోల్పోతున్న రైతులు, సాగుకు మిగులు భూమి అక్కరకు రాకపోతే ఆ భూమిని సేకరణ చేయాలన్నారు.

భూసేకరణలో భూములతో పాటు, నిర్మాణాలు, పైప్‌లైన్‌లు, షెడ్లు, చెట్లు లాంటి అన్నిటికీ విలువ చూపాలన్నారు. భూములు ఇచ్చిన రైతులకు గిరి వికాసం లాంటి ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు కలెక్టర్ తెలిపారు. కాల్వ నిర్మాణంలో వున్న గ్యాస్ పైప్‌లైన్ సమీపంలో కాల్వ ఏర్పాటుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత గ్యాస్ కంపెనీ ఇంజనీర్ల సహకారం తీసుకొని, బాక్స్ టన్నెల్ నిర్మాణం చేయాలన్నారు. పనుల్లో వేగం పెంచి, నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, నీటిపారుదల శాఖ ఈఈ అర్జున్, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ భూసేకరణ సూపరింటెండెంట్ మీనన్, ఏన్కూరు తహసీల్దార్ శేషగిరిరావు, ఉద్యానవన అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

'పోలంపల్లి' ముంపు పొలాల పరిశీలన



ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తాతయ్య

చింతకాని, జూలై 9: ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండలం పోలంపల్లి సమీపంలో మున్నేరుపై నిర్మించిన పోలంపల్లి ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో తాము నష్టపోతున్నామని చింతకాని మండలం చిన్నమండవ రెవెన్యూ పరిధిలోని రైతుల విన్నపం మేరకు మంగళవారం చింతకాని ఇరిగేషన్ జేఈ సురేష్ వరద ముంపు పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కరకట్ట నిర్మిస్తే తమ పొలాలకు ముంపు సమస్య తప్పుతుందని ఈ సందర్భంగా రైతులు జేఈకి సూచించారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకున్న జేఈ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది, బాధిత రైతులు వంకాయలపాటి బ్రహ్మం, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట ఎమ్మెల్యేను కలిసిన రైతులు

ఏపీలోని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో పాటు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎం. సృజన మంగళవారం పో లంపల్లి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నమండవకు చెందిన రైతులతో పాటు మున్నేరుకు అవతలి ఒడ్డున ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే తాతయ్యను కలిశారు. వరదల సమయంలో తమ భూములు కోతకు గురవుతున్నట్లు, పొలాల్లో ఇసుక మేటలు వేసి పంట నష్టపోతున్నట్లు వారికి రైతులు వివరించారు..

టార్గెట్ ఆగస్టు 15

'సీతారామ' రెండు, మూడు దశల పంపుహౌస్‌ల ట్రయల్‌రన్‌కు సన్నాహాలు



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో పంపుహౌస్ 1 బీజీ కొత్తూరు ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ఫేజ్ 2, ఫేజ్ 3 పూసుగూడెం, కమలాపురం పంపుహౌస్‌లను ఈ నెలాఖరులోగా ట్రయల్ రన్ చేసి విజయవంతం చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన చిరకాల స్వప్నమైన సీతారామ ప్రాజెక్టు ద్వారా ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించి గోదావరి జలాలను మొదటి దశగా ఏన్కూరు లింక్ కెనాల్ నుంచి వైరా రిజర్వాయర్‌కు వదిలేందుకు పట్టుదలతో ఉన్నారు. ఇందుకోసం ఆయన పంపుహౌస్‌ల ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు, రూ.70కోట్లతో ఏన్కూరు లింక్‌కెనాల్ పనుల పూర్తిపై పర్యవేక్షణ చేస్తున్నారు. అటు భూసేకరణ సైతం వేగవంతం చేయించేందుకు చర్యలు తీసుకుటున్నారు. రైతులను ఒప్పించి ముందుగానే భూసేకరణ చేపట్టి కాలువల తవ్వకాలు వేగంగా సాగిస్తున్నారు.

ఆగస్టు 15 లక్ష్యంగా పెట్టుకుని ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూతోపాటు ఇతరశాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు పంపించడం ద్వారా లక్షన్నర ఎకరాలకు సాగునీరు ఇచ్చి వైరా నుంచి సత్తుపల్లి మధిర నియోజకవర్గాల్లో సాగర్ ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు తలమునకలయ్యారు. ప్రస్తుతం కృష్ణానదిలో నీటిమట్టం పడిపోయింది. కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు లేవు. సాగర్ డ్యాంలో కూడా తక్కువ నీరుంది. వర్షాలు పడకపోయినా గోదావరి జలాలతో వైరా నుంచి సాగర్ ఆయకట్టును అనుసంధానం చేసి పంటలు పండించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మొదటి పంపు హౌస్ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అక్కడి నుంచి కెనాల్ 108కి.మీ. వరకు నీటి సరఫరా జరగనుంది. అయితే పూసుగూడెం వద్ద ఉన్న ఆరు మోటార్లు, కమలాపురం వద్ద ఉన్న ఏడు మోటార్లను ట్రయల్‌రన్ చేయాలంటే చైనాకు చెందిన షాంఘై కంపెనీ నుంచి 15 మంది నిపుణుల బృందం రావాల్సి ఉంది. ఈ మోటార్లను నిర్మాణ సంస్థ మేఘా కంపెనీ, చైనా నుంచి కొనుగోలు చేసింది. అయితే ఆ కంపెనీకి చెందిన నిపుణుల బృందం పర్యవేక్షణలోనే ట్రయల్ రన్ జరగాల్సి ఉంది. సాంకేతికంగా ఏ లోపం తలెత్తినా సంబంధిత మోటార్లలో పరికరాల మార్పు బాధ్యత కంపెనీ వ్యవహరించాల్సి ఉంది. దీంతో చైనా నుంచి షాంఘై కంపెనీ నిపుణుల బృందం పంపుహౌస్ వద్దకు రావాలంటే వారికి చైనా నుంచి వీసాలు మంజూరు చేయాల్సి ఉంది. దీంతో మంత్రి తుమ్మల చొరవ తీసుకుని రాష్ట్ర నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి పేషీ అధికారులతోనూ అలాగే మేఘా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులతో ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులు, విదేశీ వ్యవహారాల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి చైనా నుంచి నిపుణుల బృందం వారం రోజుల్లోగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇందుకు అవసరమైనటువంటి అనుమతి పత్రాలను కూడా కంపెనీకి అందజేయాలని సూచించారు.

ఈ నెలాఖరులోగా ట్రయల్‌రన్‌తోపాటు రెండు పంపుహౌస్‌ల నుంచి ఏన్కూరు లింక్ కెనాల్ నుంచి వైరాకు వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆగస్టు 15నాటికి సీతారామ ఎత్తిపోతల మొదటి దశను ప్రారంభించి నీళ్లు అందించాలని ఇప్పటికే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కింద రూ.8వేల కోట్లు ఖర్చు చేశారు. మొత్తం రూ.13,500 కోట్లతో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో సీతారామ పనులు గత ప్రభుత్వం ప్రారంభించిన విషయం విదితమే. ఏన్కూరు లింక్‌కెనాల్ పూర్తిచేసి ఈ ఏడాది సాగర్ ఆయకట్టు ద్వారా లక్షన్నర ఎకరాలకు నీరందించడం వచ్చే ఏడాదికి యాతాలకుంట వద్ద టన్నెల్ పూర్తిచేసి సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతంలోని మిగిలిన ఆయకట్టుకు నీటిని పంపడం, పాలేరు లింక్‌కెనాల్ పూర్తి చేసి సీతారామ ఎత్తిపోతల కాలువ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి సాగర్ మిగిలిన ఆయకట్టును స్థిరీకరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చైనా షాంఘై కంపెనీ నిపుణుల బృందం రాకతోనే పంపుహౌస్ ట్రయల్ రన్, సీతారామ ఎత్తిపోతల సాగునీటి విడుదల ముడిపడి ఉంది.

రామయ్యను దర్శించుకున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్



పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భద్రాచలం, జూలై 9: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆయనకు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఈ క్రమంలో దేవస్థానం తరపున శాలువ, స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాసరావు ఆందజేశారు. ఆయన వెంట దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వేదపండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి, లింగాల రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం నాడు ఆలయ ప్రాంగణంలోని దాసంజనేయస్వామివారికి ఆభిషేకం నిర్వహించగా, శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత: డీఎఫ్‌వో



మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో కృష్ణగౌడ్

ఇల్లెందురూరల్, జూలై9: అడవుల సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలని జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌వో) కృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం ఇల్లెందు మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఆటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా అటవీశాఖ సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో రోజు రోజుకు వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో కర్నావత్ వెంకన్న, ఇల్లెందు, కొమరారం రేంజర్లు ప్రసాద్, ఉదయ్‌కుమార్, ఎఫ్ఎస్‌వోలు సల్మాన్, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా నరేంద్రకుమార్



జూలూరుపాడు, జూలై 9: తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా జూలూరుపాడుకు చెందిన చంద్ర నరేంద్ర కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలో జరిగిన రైతు సంఘం 2వ మహాసభలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతులను ఐక్యం చూసి తమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలలో భాగంగా రూ. 2లక్షల రుణమాఫీతో పాటు, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ధరణి, భూసమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇమ్మానియల్

ఆళ్లపల్లి, జూలై 9: ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆళ్లపల్లికి చెందిన సీపీఐ నాయకుడు ఇమ్మానియల్ ఎన్నికయ్యారు. మంగళవారం దుమ్ముగూడెం మండలంలో జరిగిన రైతు మహాసభలో ఆయానను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. సీపీఐ జిల్లా నాయకులు, ఆళ్లపల్లి వైస్ఎంపీపీ రేసు ఎల్లయ్య, కోఆప్షన్ సభ్యులు రహిం, ఆళ్లపల్లి సీపీఐ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ సొమ్ము స్వాహాపై
అధికారుల తనిఖీలు

» కారేపల్లి మోడల్ స్కూల్‌లో రూ.26లక్షల నిధుల డ్రా పై విచారణ

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 9: జిల్లాలోని కారేపల్లి మోడల్ స్కూల్‌లో జరిగిన రూ.26లక్షల ప్రభుత్వ సొమ్మును ఓ అకౌంటెంట్ పోర్జరీ సంతకంతో స్వాహా చేసిన సంఘటనకు సంబంధించి మంగళవారం రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయ సీనియర్ కన్సల్టెన్సీ అధికారి జి. విజయ్ శంకర్, జూనియర్ అకౌంట్స్ అధికారి బాలజయశంకర్‌లు జిల్లాలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. నిధులు డ్రా చేసిన సంబంధిత బ్యాంక్‌లోను వివరాలను తీసుకున్నారని తెలుస్తోంది. విద్యాశాఖ కార్యాలయంలోని అకౌంటెంట్ రామకృష్ణ, సంబంధిత బ్యాంక్‌లోని ఓవ్యక్తి కలిసి విద్యాశాఖ పేరుతో ఓ ఫేక్ అకౌంట్‌ను తీసుకున్నట్లు గుర్తించినట్లు తెలిసింది.

కారేపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లి ఏ రోజు ఎన్ని నిధులు డ్రా చేశారో ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. రఘునాథపాలెం మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలోను తనిఖీలు చేసినట్లు తెలిసింది. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా ఇల్లెందు మైనారిటీ పాఠశాలకు వెళ్లి విచారించగా, అక్కడ పాఠశాల నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. ఈ పాఠశాలకు సంబంధిత ఎన్ని నిధులు డ్రా చేశారో వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరించారు. మొత్తానికి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించి సుమారు రూ.35లక్షలకు పైగా విద్యాశాఖ నిధులు స్వాహా చేసినట్లు అధికారుల విచారణలో తెలిసినట్లు తెలిసింది. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు పూర్తి వివరాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నారని, ఆ తరువాతే అసలు దోషులు బైటకు రానున్నారని తెలుస్తోంది. ఆ అధికారుల పేర్లు చెప్పేందుకు కూడా జిల్లా విద్యాశాఖ అధికారులు వెనెకడుగు వేస్తున్నారంటే నిధుల స్వాహా జరిగిన తీరు ఎలా ఉందో అర్థమవుతుంది. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదించగా ఇది కేవలం మా కార్యాలయంలోని అకౌంటెంట్ రామకృష్ణ తోపాటు పలువురు బ్యాంక్ అధికారుల ప్రమేయంతో నిధులు డ్రా అయినట్లు తెలుస్తోందని తెలిపారు. విద్యాశాఖ పేరుపై అకౌంట్ తీసేటప్పుడు తప్పని సరిగా జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం అందించాలని, కాని బ్యాంక్ అధికారులు కాని, మా కార్యాలయ సిబ్బంది కాని చెప్పకుండ ఫేక్ అకౌంట్‌ను తీసుకోని అందులోనే పాఠశాలకు సంబంధించిన డబ్బులు పడేలా ప్లాన్ ప్రకారం చేశారని తెలిపారు. ఈ విషయమై అధికారులకు తెలిపడం జరిగిందని తెలిపారు.



ఉప్పల్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

ముగిసిన కేంద్రీయ విద్యాలయ రీజినల్ కబడ్డీ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 9: ఖమ్మం నగరంలోని కరుణగిరి ప్రాంతంలో గల కేంద్రీయ విద్యాలయ్ సంఘటన్ పాఠశాలలో జరుగుతున్న రీజినల్ స్థాయి అండర్-17 బాలుర కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల విజేతగా హైదరాబాద్‌లోని ఉప్పల్ పాఠశాల జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో క్లస్టర్-3 జట్టు నిలవగా, క్లస్టర్-1 జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. నగరంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల అనంతరం విజేత జట్లకు పాఠశాల నామినీ చైర్మన్, జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరాం, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కవింద్రరాయ్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ పోటీలలో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

జూలూరుపాడు, జూలై 9: విద్యుదాఘాతానికి గురై ఆరేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండలంలోని గుండెపుడి గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండెపుడి గ్రామానికి చెందిన భూక్య వెంకటేష్, సరోజిని దంపతులకు ఆరేళ్ల బాలుడు భూక్య సాత్విక్ స్నానం చేయించేందుకు తల్లి సరోజిని హీటర్‌తో బకెట్‌లో నీటిని వేడిచేసేందుకు పెట్టింది. తల్లి కూరగాయలు కోస్తుండగా కుమారుడు ఆడుకుంటూ వెళ్లి బకెట్‌లో నీటిని పట్టుకున్నాడు. దీంతో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి


దుమ్ముగూడెం, జూలై 9: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బట్టిగూడెంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జలకం ముత్యాలరావు(42) ఈ నెల 3న కిరాణా సామాన్లు తెచ్చేందుకు అదే గ్రామానికి చెందిన జలకం సీతారాములతో కలిసి ద్వి చక్ర వాహనంపై లక్ష్మీనగరం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కిష్టారం గ్రామానికి చెందిన కణితి కృష్ణ అనే వ్యక్తి వేగంగా ద్వి చక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన ముత్యాలరావు ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సీతారాములు భద్రాచలం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలాయపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని రాకాసితండాకు చెందిన బానోతు వీరన్న(33) వ్యవసాయకూలీగా జీవిస్తున్నాడు. ఈనెల 5న పిండిప్రోలు నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా రాకాసితండాకు సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెను తప్పించబోయి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు...

ఏన్కూరు, జూలై9: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని బురదరాఘవాపురం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పినపాక రమణయ్య(65) తన ఇంటి ముందు పత్తి చేనులో కలుపు తీస్తుండగా పొలంలో గల కరెంట్ స్తంభం సపోర్టు తీగ ప్రమాదవశాత్తూ తగిలి అక్కడికక్కడే మృతి చెదాడు. మృతుడి కుమారుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ...



కొండలు(ఫైల్)

బోనకల్, జూలై 9: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రావినూతల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన బోయినపల్లి కొండలు(53) తన పొలానికి వెళ్లాడు.. అక్కడ నుంచి ఇంటికొచ్చే క్రమంలో వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారి పై రామాపురం నుంచి రావినూతల వైపునకు వస్తున్న అజాక్స్ మిల్లర్ ముందున్న అరకను ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న అతడిని ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యం వలనే మృతి చెందాడని భావించిన మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు. కాగా పోలీసుల జోక్యంతో ఆందోళన చేసే ఆలోచనను విరమించుకున్నారు. మృతుడికి భార్య కుమార్తె ఉన్నారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ సందర్శించి నివాళులర్పించారు.

పెద్దతోగు ఫారెస్ట్ బీట్ అధికారి సస్పెన్షన్

● అక్రమ కలప రవాణాపై సస్పెండ్ చేసిన అధికారులు

ఇల్లెందురూరల్, జూలై9: అక్రమంగా కలప రవాణా చేస్తూ పట్టుబడిన పెద్దతోగు ట్ ఆఫీసర్ ధరావత్ నిర్మలను జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్ సస్పెండ్ చేశారు. గత నెల 16న గుండాల మండలం పెద్దతోగు అటవీ ప్రాంతం నుంచి నెంబర్‌లేని ట్రాక్టర్‌లో అర్ధరాత్రి టేకు కలపను అక్రమంగా తరలిస్తుండగా, కొమరారం రేంజ్ అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ అక్రమ కలప వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడడంతో విచారణ చేసిన జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఆ అధికారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గోదావరిలో మునిగిపోతున్న వ్యక్తిని కాపాడిన బోటు సిబ్బంది

భద్రాచలం జూలై 9: భద్రావలంలోని గోదావరి స్నానఘట్టాల వద్ద మంగళవారం ఒక వ్యక్తి స్నానానికి దిగి లోతు అంచనా వేయలేక మునిగిపోతుండగా చుట్టుపక్కల వారు బిగ్గరగా అరిచారు. దీంతో పక్కనే ఉన్న బోటు నిర్వాహకుడు ప్రసాద్ గోదావరి నదిలోకి ఈత కొట్టుకుంటూ వెళ్లి ఆ వ్యక్తిని సురక్షతంగా ఒడ్డుకు చేర్చాడు. ఈ క్రమంలో అతని వివరాలను సేకరించేందుకు ప్రయత్నించగా ఏపీలోని ప్రకాశం జిల్లా సంతరావూరుకు చెందిన పొకల రమేష్ గా పేర్కొన్నాడు.

ఉపాధిహామీలో కమీషన్ల బేరం

» ఒక్కో మస్టర్‌కు రూ.200 ఇవ్వాలని డిమాండ్

» కామేపల్లి మండలంలోని ఓ గ్రామంలో కూలీలతో బేరమాడుతున్న సాంకేతిక నిపుణుడు

» సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో



కమీషన్ కోసం బేరమాడుతున్న సాంకేతిక నిపుణుడు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 9: వ్యవసాయ పనులు లేని రోజుల్లో చిన్న, సన్నకారు రైతులకు, కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. పటిష్ఠమైన సాంకేతిక విజ్ఞానాన్ని ఏర్పాటు చేసి అడుగడుగున డిజిటల్ సంతకాలతో కూలీల హాజరు విధానాన్ని ప్రవేశ పెట్టింది. అయినా క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధి ఉద్యోగులు అవినీతికి తెర లేపడంతో అక్రమార్కులకు ఉపాధి హామీ పథకంగా వరంగా మారింది.

ఖమ్మం జిల్లాలో పనిచేయ్యని వారికి అక్రమంగా హాజరు (మస్టర్)లు వేసి వారి నుంచి ఒక్కో హాజరుకు రూ.100వరకు వసూళ్లు చేసే విషయాన్ని ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు ప్రచురితమైన విషయం విదితమే. కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు మండలాల్లో కొన్ని గ్రామ పంచాయతీల్లో బహిరంగంగా వసూళ్లు చేసి క్షేత్రసహాయకులు, సాంకేతిక నిపుణులకు కూలీలు అందించారు. అయినా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు పట్టించుకోకపోగా, ఆయా మండల స్థాయిలోని అధికారులు, సిబ్బంది మంచిగా పనిచేశారని కితాబులు ఇచ్చారు. దీంతో తమ అక్రమాలకు అధికారుల అండ ఉందని భావించిన క్షేత్రసహాయకులు, సాంకేతిక నిపుణులు మరో అడుగు ముందుకేశారు. అప్పటి వరకు రోజు కూలీ రూ.230 వస్తుండగా, దానిని రూ.300లకు పెంచారు. అప్పటి వరకు వస్తున్న కమీషన్‌గా వస్తున్న రూ.100ను రూ.200లకు పెంచాలని కూలీలపై వత్తిడి పెంచారు.

మాది పర్మినెంట్ ఉద్యోగం కాదు..

మాది పర్మినెంట్ ఉద్యోగం కాదని, మేము పెదోళ్లమే మా వంతు చూడాలని కామేపల్లి మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో సాంకేతిక నిపుణులు కూలీలతో కమీషన్ బేరం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక దశలో కూలీలు మాకు ఎక్కువ మస్టర్ వద్ద చేసిన పనికే డబ్బులు ఇవ్వాలని సైతం కోరారు. గతంలో వలే మస్టర్‌కు రూ.100 మాత్రమే ఇస్తామని అంతకు మించి రూ.200 అడిగితే గోడవలు జరుగుతాయని కూలీలు సాంకేతిక నిపుణుడిని హెచ్చరించారు. ఇప్పుడు రూ.100 సరిపోవడం లేదని అడుగుతున్నారు. విషయం బయటకు వచ్చి అస్సలే రాకుండా పోతాయి అప్పుడు మీకే ఏలా ఏల్లిద్ది అంటూ కూలీలు నిలదీశారు. దీంతో స్పందించిన సాంకేతిక నిపుణుడు మీలో ఎవ్వరు పనిచేస్తున్నారో నాకు తెలుసు, నేను మిమ్మల్సి సమానంగా చూస్తున్నా.. అంటూ కూలీలను బేదిరించారు. దీనికి కూలీలు అంగీకరించలేదు. దీంతో ఉపాధి అక్రమాల బేరాలను వీడియో తీసిన కూలీలు, సోషల్ మీడియాలో పోస్టు చేయటంతో వైరల్‌గా మారింది. ఈ విషయంపై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్యను వివరణ కోరగా విచారణ జరుగుతుందని, మరో రెండు రోజులు విచారణ కోనసాగుతుందన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచితంగా రెండు టన్నుల విత్తన చెరుకును అందిస్తాం

● కల్లూరు చెక్కర కర్మాగార యాజమాన్యం ప్రకటన



రైతులతో మాట్లాడుతున్న కాకతీయ చక్కెర కర్మాగార ఉద్యోగులు

వైరా జూలై 9: ఈ ఏడాది డిసెంబర్లో చెరుకు సాగుచేసే రైతులకు రెండు టన్నుల విత్తన చెరుకును ఉచితంగా సరఫరా చేస్తామని కల్లూరు చెక్కర కర్మాగార యాజమాన్యం ప్రకటించింది. మంగళవారం వైరా మండలంలోని గండగలపాడు, మునలమడుగు గ్రామాల్లో కల్లూరు చెక్కర కర్మాగార అధికారులు, సిబ్బంది పర్యటించి రైతులతో సమావేశాలు నిర్వహించారు. చెరకు సాగుచేసే రైతులకు తమ కర్మాగారం నుంచి అందించే ప్రోత్సాహకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ షుగర్ కేన్ యాజమాన్యం రఘునాథ్‌బాబు, హరిబాబు, ఫీల్డ్‌స్టాఫ్ వెంకటస్వామి, మూర్తి పాల్గొన్నారు.

కేంద్రం కుట్రలను ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలి

» ప్రతిఘటన ఉద్యమాలతో సింగరేణిని పరిరక్షించుకుంటాం » ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, జూలై 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి సంస్థను దశలవారీగా నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని, ఆ చర్యలను ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలని ఎమ్మెల్యే సింగరేణి గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. బొగ్గు బ్లాక్‌లను వేలం వేసేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేపట్టిన మూడోరోజు మంగళవారం రిలే నిరాహారదీక్షల సందర్భంగా శిబిరాన్ని ఆయన సీపీఐ రాష్ట్రసమితి పక్షాన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు, చట్టాలను తీసుకువస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్‌కు దారాధత్తం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, దశలవారీగా సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసి బొగ్గుబ్లాక్‌లను కార్పొరేట్ సంస్థలకు, ఆదానీ, అంబానీ లాంటి కుబేరులకు కట్టపెట్టే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇప్పటికే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు తాకట్టుపెట్టి కేంద్రం మరో అడుగు ముందుకు వేసి, తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని లేకుండా చేసే చర్యలకు పూనుకుంద న్నారు. ప్రజలు అప్రమత్తమై కేంద్రం చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వేలం ప్రక్రియని కేంద్రం విరమించుకోవాలని, తెలంగాణ బొగ్గుబ్లాక్‌లను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి శేషయ్య, జి. వీరస్వామి, వంగ వెంకట్, కిష్టాఫర్, కత్తెర్ల రాములు, సందెబోయిన శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, సురేందర్, చంద్రయ్య, రాజు, రాజయ్య, కుమార్‌రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే హక్కులు, సమానత్వం సాధ్యం

» బుద్ధవనం ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య



సభలో మాట్లాడుతున్నమల్లేపల్లి లక్ష్మయ్య

ఖమ్మంచర్చికాం పౌండ్, జూలై9: అందరం కలిసి పోరాడితేనే సమాన హక్కులు, సమానత్వం సాధ్యమవుతుందని అంబేద్కర్ చెప్పారని ప్రముఖ సామాజిక విశ్లేషకుడు, బుద్ధవనం ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన యూనిటీ ఆఫ్ మాల తృతీయ వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితులకు రాజ్యాంగ ఫలాలు అందిన నాడే అసలైన అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. మాలలు ఏ వర్గానికి తలవంచి బతకాల్సిన అవసరం లేదన్నారు. చరిత్రను మననం చేసుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలన్నారు. అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాములు శ్రీను ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ బీజీ క్లె మెంట్, యూనిటీ ఆఫ్ మాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందుల ఉపేందర్, అవుట మధు, జాగ మధు, సుఖభోగి కోటేశ్వరరావు, గులగట్టు యల్లయ్య, చిలకబత్తిని కనకయ్య, మేడికొండ శౌరి, మోటపోతుబాబురావు, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సొమ్ముల స్వాహాపై విచారణ

●బర్లగూడెంలో జీపీ కార్యాలయంలో విచారణ చేపట్టిన ఏపీవో

కామేపల్లి, జూలై 9: మండలంలోని బర్లగూడెం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏపీవో శ్రీరాణి మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధి హామీ సొమ్ములు అనే ఫిర్యాదులో వచ్చిన పేర్లను పరిశీలించారు. ఓ వ్యక్తి కావాలనే తప్పుడు ఫిర్యాదు చేసి, అధికారులను తప్పుదోవపట్టిస్తున్నారని, కార్యాలయం ఎదుట కొంతమంది ఆందోళన చేపట్టారు. విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు.

బంగారం అపహరణ

● సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఘటన

సత్తుపల్లి, జూలై9: బస్సు ఎక్కుతున్న ప్రయాణికురాలి బ్యాగ్‌లోని 112గ్రాముల బంగారం అపహరణకు గురైన సంఘటన సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన మామిళ్ల వరలక్ష్మి సత్తుపల్లి పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో 112గ్రాముల బంగారాన్ని రిలీజ్ చేసుకుని ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలో బస్ ఎక్కేందుకు బస్టాండ్ వెళ్లగా, తన బ్యాగులోని బంగా రు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించా రు. ఇది గమనించిన ఆమె సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్‌ను వివరణ కోరగా బంగారం అపహరణపై ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

ఇల్లెందుటౌన్, జూలై 9: మునిసిపాటిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న అరేపల్లి కార్తీక్(28) మధ్యాహ్నం మున్సిపాలిటీలో చెత్త సేకరణ డ్యూటీకి వెళ్లి వచ్చి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అవివాహితుడైన కార్తీక్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కాగా కాంట్రాక్టు కార్మికుడు మృతి పట్ల మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. యాకూబ్ షావలి, మున్సిపల్ జవాన్లు కల్యాణ్, ప్రకాష్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీరు హతహర్‌పాషా, డ్రైవర్‌యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాఫీ, రాజేష్, సంపత్, రవిరెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.



వృత్తి విద్యా కోర్సులకు ఉచిత శిక్షణ: డీజీఎం పర్సనల్


డీజీఎం పర్సనల్ రమేష్

మణుగూరు , జూలై 9: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు పలు రకాల వృత్తి విద్యా కోర్సులను నిర్వహించనున్నట్లు ఏరియ అధికార ప్రతినిధి సలగల రమేష్ మంగళవారం తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్స్, రెక్సిన్, లెదర్ బ్యాగ్‌ల తయారి, క్లాత్, జూట్, బంజారబ్యాగ్స్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సుల్లో ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం హైదరాబాద్ వారి సారధ్యంలో నేర్పించి సర్టిఫికెట్లను కూడా అందజేస్తామన్నారు. గతంలో ఈ కోర్సుల్లో శిక్షణ పొందిన వారు సొంతగా యూనిట్లు పెట్టుకుని జీవనోపాధిని పొందుతున్నారని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 20లోపు తమ దరఖాస్తులను జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్ విభాగంలో అందజేయాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో ఘనంగా సీత్లా వేడుకలు


ఇల్లెందు, జూలూరుపాడులో సీత్లా వేడుకలు

జూలూరుపాడు, జూలై 9: మండలంలోని గిరిజన గ్రామాల్లో (తండాల్లో) మంగళవారం సీత్లా వేడుకలను గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పొలిమేర్ల వద్ద ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించారు. సాంప్రదాయ నృత్యాలు చేసి అలరించారు. మేకలను, కోళ్లను బలిగా అర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని, గ్రామాలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

గుండాల: సకల దేవతలు కరుణించాలని. విరివిగా వానలు కురువాలని.. పాడి పంటలతో.. సుఖ సంతోషాలతో చల్లంగా ఉండాలని.. మండలంలోని పలు తాండాల వాసులు కులదేవతలను వేడుకున్నారు. మండల కేంద్రంతో పాటు నర్సాపురం తండా, రోళ్లగడ్డ తండా, జగ్గుతండా వాసులు మంగళవారం ఆచార సాంప్రదాయాలతో సీతలా పండుగ నిర్వహించారు. దీంతో తండాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ఇల్లెందురూరల్:తండాల్లో పకృతిని ఆరాదిస్తూ పశుసంపదను కాపాడుకునేందకు ప్రతి ఏటా లంబాడీలు(బంజారాలు)జరుపుకునే సీత్లా భవాని పండుగను మంగళవారం ఇల్లెందు ఏజెన్సీ గ్రామాల్లో, తండాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఇల్లెందు మండలంలోని పలు తండాల్లో సీత్లా పండుగను గిరిజనులుభక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.వర్షాకాలంలో పశువులు అనేక వ్యాదుల బారిన పడకుండా కాపాడాలని పకృతి దేవతాలకు మొక్కలు చెల్లించడం ఈ పండుగ ప్రత్యేకత.

కాంట్రాక్టు కార్మికులు హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాలను తీసుకోవాలి

▸ ఇల్లెందు ఏరియి జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు టౌన్, జూలై 9: సింగరేణిలో పని చేసే కాంట్రాక్టు కార్మికులు హెచ్‌డీఎఫ్‌సీ సేవలను వినియోగించుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ సూచించారు. మంగళవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు యాక్సిడెంట్ ఇన్సురెన్స్ పేరిట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో సింగరేణి సంస్థ ఫిబ్రవరి 26న ఒప్పందం చేసుకుందని వివరించారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రతి కాంట్రాక్టు కార్మికుడు జీరో ఖాతా తెరుచుకోవాలని దీని వల్ల కాంట్రాక్టు కార్మికుడు విధులు నిర్వహిస్తు కానీ చనిపోతే వారి కుటుంబానికి ఇన్సురెన్స్ డబ్బులు రూ.20లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికుడు డెబిట్ కార్డు ఆరు నెలలకు ఒకసారి ఉపయోగించినట్లైతే అదనంగా మరో రూ.10లక్షలు ఇస్తారన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సింగరేణిలో పని చేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు ఖాతాను నమోదు చేసుకోవాలని, ఖాతానమోదు కొరకు ఆధార్, పాన్ కార్డు, ఫొటో అవసరం ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ. మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, ఫైనాన్స్ మేనేజరు మధుబాబు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు రహీంపాషా, లక్ష్మీనారాయణ రవి, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, సింగరేణి కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు వినతి

మణుగూరు , జూలై 9: మణుగూరు ఏరియాలోని ఓల్డ్ స్టోర్స్ సమీపంలో మణుగూరు గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని పలు పార్టీల నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, రావులపల్లి రామ్మూర్తి, శంకర్‌రావు, రాంబాబు, రైస్‌మిల్లు రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక యువకులు అనేక మంది ఈ మైదానంలో కానిస్టేబుల్, మిలట్రీ, ఇతర ఉపాది అవకాశాల కోసం శారీరక దారుడ్యం కొసం వ్యాయామాలు చేస్తుంటారని తెలిపారు. అయితే కొంత మంచి ప్రాక్టీస్ చేస్తే ఎంతోమంది యువకులు సెలెక్ట్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక యువకులకు మంచి ప్రోత్సాహాన్ని కల్పించినట్లౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వి రమేష్, జీ వెంకటేశ్వర్లు, సంతోష్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల అభివృద్ధికి రూ.3.99కోట్ల ప్రతిపాదనలు

▸ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
▸ నూతన పాలిటెక్నిక్, నవోదయ, జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి
▸ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక అందజేత


భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కొత్తగూడెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్నసమస్యల పరిష్కారానికికావాల్సిన రూ. 3.99 కోట్ల నిధులకు సంబంధించిన నివేదికను ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశంకు అందించినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 2. 25కోట్లు, పాల్వంచ ప్రభుత్వం జూనియర్ కళాశాలకు రూ. 84లక్షలు, లక్ష్మీదేవిపల్లి ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు రూ. 90లక్షల ప్రతిపాదనలు అందించినట్లు తెలిపారు. ఈ నిధులతో అదనపు గదులు భవనాల నిర్మాణం, మౌళిక వసతుల కల్పనకు వెచ్చించనున్నట్లు తెలిపారు. త్వరలో ఈ నిధులు మంజూరు చేసేందుకు ప్రిన్సిపల్ సెక్రటరీ హామీ ఇచ్చినట్లు కూనంనేనితెలిపారు. నియోజకవర్గంలో నవోదయ విద్యాలయం, సుజాతనగర్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును బేటి అయినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఐటీ హబ్ ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుచేయాలని కోరామని దీనిపై త్వరలో ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభిస్తామని హామి ఇచ్చారని అయితే వీటి ఏర్పాటుకు 60 ఎకరాల స్థలం అవసరం అవుతుందని ఈ స్థలంకు సంబంధించిన వివరాలు అందించాలని మంత్రి కోరారని తెలిపారు. పాల్వంచ ప్రభుత్వం ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరుతూ రాష్ట్ర హెల్త్ సెక్రటరీకి లేఖ అందించి అందుకు సంబంధించిన వివరాలు స్వయంగా వివరించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించిన ప్రక్రియలు త్వరలో పూర్తవయుతాయని తెలిపారు. తన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు, ప్రిన్సిపల్, హెల్త్ సెక్రటరీలకు అభినందనలు తెలిపారు.

పాల్వంచలో రూ. 4కోట్ల అభివృద్ధి పనులు

పాల్వంచ టౌన్: రూ. 2కోట్లతో చేపట్టనున్న కళాక్షేత్రం భవన నిర్మాణం పాల్వంచకు తలమానికంగా నిలవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 4కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృదిధ పనుల్లో ఏ మాత్రం నాణ్యత లోపించినా ఉపేక్షించేది లేదని దీనికి అధికారులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికల రూప కల్పన చేస్తున్నామని తెలిపారు. పట్టణ జనాభాకు అనుగుణంగా మౌళిక వసతులను కల్పిస్తామన్నారు. రూ. 60కోట్లతో ఎపీ స్టీల్స్‌పట్టినగర్ బైపాస్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్నామని అన్నారు. రూ. 600కోట్లతో ఔటర్‌రింగ్ రోడ్డు ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయని పేర్కొన్నారు. అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధుల సమష్టి కృషి నిర్ణయాలతో నియోజకవర్గంలో సమస్యలన్నింటిని పరిష్కరించుకుని అభివృద్ధి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా నిలుపుతామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమీషనర్ ఎ. స్వామి, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ నాగేశ్వర రావు, మున్సిపల్, ఇతరశాఖల అధికారులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ, మండల కార్యదర్శులు ఎ. సాయిబాబు, వి. పూర్ణచందర్‌రావు, రాహుల్,కాంగ్రెస్ నాయకులు ముత్తయ్య రంగారావు, కే. వెంకన్న, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం


రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

దుమ్ముగూడెం జూలై 9: భద్రాచలం-చర్ల ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై చినబండిరేవు గ్రామ సమీపంలో మంగళవారం భారీ చింతచెట్టు నేల కొరిగింది. చెట్టు కొమ్మలు విద్యుత్‌లైనుపై పడడంతో సరఫరాను నిలిపివేశారు. అలాగే కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్దరణతోపాటు, చెట్టు కొమ్మల తొలగింపు ప్రక్రియను వెంటనే చేపట్టారు.

పొదెం వీరయ్యకు పదవి పట్ల శ్రేణుల సంబరాలు

దుమ్ముగూడెం జూలై 9: అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి పొదెం వీరయ్యకు దక్కడంతో లక్ష్మీనగరం పార్టీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చారు. వీరయ్యకు పదవి రావడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపిందని మండల అధ్యక్షుడు వినీల్ తెలిపారు. నటరాజస్వామి, దేవా, బాలాజీ, శేఖర్, హరికృష్ణ, సందీప్‌రెడ్డి, సంగీతరావులున్నారు. మరో కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు మద్ది కుమారి ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు.

మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత: ఎంపీపీ

అశ్వాపురం జూలై 9: మొక్కలు నాటడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొండికుంట, గొల్లగూడెం గ్రామపంచాయతీల్లో ఎంపీపీ మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాల జీవనానికి మొక్కలే జీవనాధారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, ఉపాధిహామీ టిఏ విజయలక్ష్మి, గొల్లగూడెం మాజీ సర్పంచ్ పొడియం అనిల్‌కుమార్, మొండికుంట కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ల మధ్యలో కోనోకార్పస్ మొక్కల తొలగింపు

దమ్మపేట, జూలై : దమ్మపేటలో డివైడర్ మధ్యలో పెంచిన కోనోకార్పస్ మొక్కలను పంచాయతీ అధికారులు మంగళవారం నుంచి తొలగిస్తున్నారు. దీనిపై ప్రస్తుత ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి సురేష్ వివరణ కోరగా దమ్మపేటకు సెంట్రల్ లైటింగ్ మంజూరు అయిందని వాటి నిర్మాణం కోసం తొలిగిస్తున్నట్లు తెలిపారు. కోనో కార్పస్ మానవాళికి, ప్రజలకు ఆరోగ్యానికి హానీకరం చేసేవీ కావటంతో తొలిగిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ లైటింగ్ పూర్తీకాగానే పూల మొక్కలు పెంచుతామన్నారు.

జాతీయ విద్యావిధానానికి విద్యార్థులను సిద్దం చేయాలి

అశ్వారావుపేట, జూలై 9: జాతీయ విద్యావిధానానికి అంగన్‌వాడీ విద్యార్థులను కార్యకర్తలు సిద్ధం చేయాలని సీడీపీవో రోజారాణి సూచించారు. మంగళవారం ఐసీడీఎస్‌లో జాతీయ విద్యావిధానంపై అంగన్‌వాడీ వర్కర్లుకు మూడవ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ విద్యావిధానంలో మార్పులు, కొత్త రివైజ్‌డ్ సర్కులమ్‌లను మండలంలో గల అంగన్‌వాడీ వర్కర్లుకు అవగాహన కల్పించారు. ఇక నుండి ప్రతి సెంటర్‌లో నూతన విద్యావిధానం ద్వారానే బోధించాల్సి వుంటుందని, ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. శిక్షణ ను మాస్టర్ ట్రైనర్ జె వరలక్ష్మి ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతు సంఘం నూతన కార్యవర్గంలో పలువురికి చోటు

సుజాతనగర్, జూలై 9 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలో ఇటీవల ఏఐకేఎస్ ద్వితీయ మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన ఈ మహాసభలో సుజాతనగర్‌కు చెందిన పలువురు నాయకులకు కార్యవర్గంలో చోటు లభించింది. దీనిలో భాగంగా ఏఐకేఎస్ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం భద్రాద్రి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీపీఐ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల వెంకటేశ్వరరావును, జిల్లా ఉపాధ్యక్షులుగా తాళ్లూరి పాపారావును, జిల్లా సహాయ కార్యదర్శిగా కోమారి వీర హనుమంతరావును, జిల్లా కార్యవర్గ సభ్యులుగా భూక్యా మదన్ సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యువకుడిని ఢీ కొట్టిన లారీ

జూలూరుపాడు, జూలై 9: జూలూరుపాడులోని ఉపమార్కెట్ యార్డు సమీపంలో యువకుడిని లారీ ఢీ కొన్న సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన యాట నరసింహారావు రహదారి దాటుతుండగా ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో యువకుడి ఎడమ కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు జూలూరుపాడులోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి ప్రవేట్ వాహనంలో తరలించారు. సంఘటన స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు.

ఎమ్మెల్యేగారూ.. మీ హామీ ఏమైంది?


ప్రమాదకర కల్వర్టుపై నిలిచిన ఆటో

దుమ్ముగూడెం జూలై 9: ధ్వంసమైన రహదారి నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఇచ్చిన హామీ ఏమైందని అచ్యుతాపురం ఆదివాసీలు మంగళవారం ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికలను బహిష్కరించిన తమకు రహదారిని నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీతో ఓటింగ్‌లో పాల్గొన్నామని తెలిపారు. నెలలు గడుస్తున్నప్పటికీ పనులు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోకి ఏదైనా వాహనం రావాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని, పూర్తి శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టు, రహదారులను వెంటనే నిర్మించాలని ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామరాజు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.

నేడు గండుగులపల్లిలో విద్యుత్ సదస్సు

దమ్మపేట, జూలై 9: గండుగులపల్లి విద్యుత్ సెక్షన్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం విద్యుత్ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏఈ మహేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసదస్సు ఉదయం 10.30 గం.లనుంచి మధ్యాహ్నం 1 గం.ల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

భగీరథ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

● బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి

పాల్వంచ టౌన్, జూలై 9: ఇంటింటికి తాగునీరు అందించే పనిలో భాగంగా మిషన్ భగీరథ కాంట్రాక్టర్, సీసీ రోడ్లు ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ మేనేజరు ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మిషన్‌భగీరథ పని దక్కించుకున్న కాంట్రాక్టర్ పైప్‌లైన్ వేసే క్రమంలో తవ్విన రోడ్డును పని పూర్తి కాగానే యధావిధిగా తిరిగి కాంక్రీట్ చేయాల్సి ఉండగా వాటిని అలానే వదిలేస్తున్నారని, తద్వార వాహనదారులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. గత కొంతకాలంగా ప్రతి వార్డులో సీసీ రోడ్లు తవ్వి వదిలేశారని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి మిషన్ భగీరథ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధానకార్యదర్శి ఎం. లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే చిర్రకుంట చెరువుకు మరమ్మతులు

▸ ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చెరువును పరిశీలిస్తున్న అధికారులు

కరకగూడెం, జూలై 9: మండలంలోని చిరుమళ్ళ పంచాయితీ రాయణపేట చిర్రకుంట చెరువు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువు కట్ట కూలి చెరువుకు పెద్దఎత్తున చెరువుకు గండి పడింది. దాంతో చెరువులో నీరు వృదాగా పో తున్నాయి. దాంతో చిర్రకుంట చెరువు ప్రమాకరంగా మారింది. మంగళవారం చిర్రకుంట చెరువుకు గండి అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురించడంతో స్పందించిన ఇరిగేషన్ ఈఈ మంగళవారం చిర్రకుంట చెరువును ఆయకట్టు రైతులతో కలిసి పరిశీలించారు. ఆంధ్రజ్యోతితో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చెరువు మరమ్మతులకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించామని త్వరలోనే మరమ్మతులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రమేష్, ఏఈ సక్రు, రైతులు పాల్గొన్నారు.

సిలబస్‌ను సకాలంలో పూర్తిచేసుకోవాలి: ఏటీడీవో

అశ్వారావుపేట రూరల్, జూలై 9: సకాలంలో సిలబస్‌ను పూర్తిచేసి ఆశ్రమాలలో మంచి ఫలితాలు వచ్చేలా పూర్తిస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఏటీడీవో చంద్రమోహన్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కావడిగుండ్ల, అనంతారం గిరిజన ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఏటీడీవో సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల, ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ రకాల రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఆశ్రమాలలో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రెండు పాఠశాలల్లోనూ విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థినుల చేత లెక్కలు చేపించి సామర్థ్యాన్ని పరీక్షించారు. ఏటీడీవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సిలబస్‌ను అనుకున్న సమయం కంటే ముందే పూర్తిచేసుకోవాలన్నారు. అందరూ సమయపాలన పాటిస్తూ మంచి ఫలితాలు వచ్చేలా సమిష్టిగా కష్టపడి పనిచేయాలన్నారు. విద్యార్థులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మమతరాణి, శేషమ్మ, ఉపాధ్యాయులు, ఇబ్బంది ఉన్నారు.

దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

భద్రాచలం, జూలై 9: న్యాయవాది కృష్ణప్రసాద్ అరెస్ట్ విషయంలో దురుసుగా ప్రవర్తించిన పోలీస్ ఆధికారులు, సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.ఈ మేరకు న్యాయవాదులు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు పోలీస్ కేసులలో ఎవిడెన్స్‌లను బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. న్యాయవాది అరెస్ట్ విషయంలో హీనమైన నేరస్తుడిగా పరిగణించి సంకెళ్లు వేసి విచక్షణా రహితంగా దాడి చేసిన ఆదికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ జనరల్ బాడీ తీర్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లేఖను జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లుకు ఆందజేశారు.

యువత క్రీడల్లో రాణించాలి: ఏఎస్పీ

చర్ల, జూలై 9: యువత క్రీడల్లోనూ రాణించాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సూచించారు. మంగళవారం చర్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 22 వాలీబాల్ టీంలకు, చర్ల స్టేషన్‌లో వాలీబాల్ కిట్లు అందజేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ, యువత చదువులపై మక్కువ సాదించాలన్నారు. చదువుతోనే మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని గుర్తు చేశారు. అలాగే గిరిజన గ్రామాల్లోని యువతీ, యువకుల్లో మంచి క్రీడా ప్రతిభ దాగుంటుందన్నారు. చెడు అలవాట్లుకు యువత దూరంగా ఉండాలన్నారు.అలాగే క్రీడలు కూడా భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడుతాయన్నారు. చర్ల మండలంతోని యువతీ, యువకులకు చర్ల పోలీస్ శాఖ ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్ఐ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి: సీపీఐ

మణుగూరు , జూలై 9: అశ్వారావు పేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతికి బాధ్యులైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని సీపీఐ మణుగూరు మండల పట్టణ కార్యదర్శులు జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్ఐపై ఉన్నతాధికారుల ఒత్తిడి వేదింపులు ఆయన ఆత్మహత్యకు కారణమైయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో తోట రమేష్, ఎస్‌వి నాయుడు, రాములు, కొత్తపల్లి సీతారాములు, శ్రీరాములు, రంగు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండండి: డీఎస్పీ


గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు , జూలై 9: గోదావరి ప్రవాహాల వల్ల పోటెత్తే వరద నీరు, గోదావరి వరద నీరు గ్రామాన్ని చుట్టుముట్టే సందర్భాలు గతంలో ఉన్న నేపథ్యంలో మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామ వాసులు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి గ్రామస్థులకు సూచించారు. మంగళవారం కమలాపురం గ్రామాన్ని చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరదల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు తెలియజేయాలని దీంతో ప్రజలకు సహాయక చర్యలను చేపట్టడం సులభతరం అవుతుందన్నారు. అనంతరం పట్టణాలకే కాకుండా పల్లెల్లో కూడా సైబర్ నేరగాళ్ల బారిన పడి సామాన్య మధ్య తరగతి ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్న క్రమంలో గ్రామస్థులకు సైబర్ నేరాలపై కొత్తగా వచ్చిన చట్టాలపై కూడా డీఎస్పీ రవీందర్ రెడ్డి అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్ కుమార్, సిబ్బంది షమీమ్ పాల్గొన్నారు.

'సీతారామ' ద్వారా ఏజెన్సీ గ్రామాలకు సాగునీరు అందించాలి



ప్రచారం నిర్వహిస్తున్న ఎన్డీ నాయకులు

ఇల్లెందురూరల్, జూలై 9: సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలకు సాగునీరు అందించాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లెందు మండలం పలు గ్రామాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఇల్లెందు మండలంలోని మర్రిగూడెం, పోలారం. భద్రుతండా, బొంబాయితండా గ్రామాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎన్డీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరావు, కొక్కు సారంగపాణి మాట్లాడుతూ గోదావరి నీళ్లను ఏజెన్సీ గ్రామాలకు ఇవ్వకుండా మైదాన ప్రాంతాలకు తరలిస్తే న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పెద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడామని హెచ్చరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏజెన్సీ రైతులను మోసం చేస్తే సహించమని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో వాంకుడోత్ సరోజన, సీతారాములు, మంగ్య, వీరన్న, రామచంద్ర, విజయ్, మంగిలాల్, దేవిజా, లక్ష్మనాయక్ పాల్గొన్నారు.

కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం


వినతిపత్రం అందజేస్తున్న కిసాన్‌మోర్చా నాయకులు

భద్రాచలం/ అశ్వాపురం, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు ఆరోపించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం భారతీయ జనతా పార్టీ భద్రాచలం కిసాన్ మోర్చా మండల కమిటి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఆందజేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తక్షణమే రూ.2లక్షల రుణామాఫీ చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి పంటల బీమా యోజనను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మారావు, మండల అధ్యక్షులు మునిసెట్టి రామ్మోహనరావు, నాయకులు నాగబాబు, సుంకరమోహన్ కృష్ణ, వెంకన్న, శ్రీనివాస్, శ్రీహరి, వెంకటేశ్వర్లు, సుదర్శన్, అప్పారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అశ్వాపురం: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రైతు రుణ మాఫీని బేషరతుగా అమలుచేయాలని బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతుసమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల అయిలయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు లింగారెడ్డి, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు గోసులరాములు, నాయకులు నాగేశ్వరరావు, సురేష్, కోలాబాస్కర్, రాజమౌళి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రి తుమ్మలకు వినతులు

▸ స్వగ్రామం గండుగలపల్లిలో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే జారే


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దమ్మపేట, జూలై 9: వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగులపల్లిలో ఆయన నివాసంలో మంగళవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కలిశారు. పలువురు సమస్యల పరిష్కారం కోసం తుమ్మలకు వినతిపత్రాలు అందజేశారు. భద్రాచలం నుంచి పాల్వంచ మీదుగా వైజాగ్ కు నడుపుతున్న లహరీ బస్ సర్వీసుకు దమ్మపేటలో స్టేజీ ఏర్పాటు, బకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలనీ పామాయిల్ సంఘం రాష్ట్రకమిటి సభ్యుడు కొయ్యల అచ్యుతరావు మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం రెవెన్యూలో వీఆర్వో వ్యవస్థను రద్దుచేసి వీఆర్వోలకు వేరువేరు చోట్ల ఉద్యోగాలు కల్పించారనీ దానివల్ల తమకు సీనియారీటి కోల్పోవటంతో తీవ్రంగా నష్టం జరుగుతుందని పరిశీలించి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని వీఆర్వోల సంఘం తరుపున తుమ్మలకు వినతిపత్రం అందజేశారు. డీసీసీబీలో ఏజెన్సీలోని పట్టా భూములకు మార్టిగేజ్ రుణాలు ఇవ్వటం లేదని దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఏజెన్సీలో మార్టిగేజ్ రుణాలు ఇప్పించాల్సిందిగా పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలనీ, వ్యక్తిగత సమస్యల కోసం పలువురు ఆయనను కలిసారు. తుమ్మల ను కలిసిన వారిలో పామాయిల్ అడ్వైజరీబోర్డు డైరెక్టర్, పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు, ఎంపీపీ సోయం ప్రసాదు, దొడ్డా ప్రసాదు, బండి బాస్కర్, కేవి సత్యనారాయణ, చళ్ళగుళ్ళ నర్సింహారావు, కాసానీ నాగప్రసాదు, మంగేశ్వరరావు, మన్నెం అప్పారావు, నిర్మల పుల్లారావు,తో పాటు సత్తుపల్లి, వేంసూరు, ముకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు పలువురు కాంగ్రేస్ పార్టీ నాయుకులు ఉద్యానవనశాఖా అదికారులు కలిసారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దమ్మపేటకు చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకుడు మాజీ ఎంపీపీ, తుమ్మల అనుచరుడు పానుగంటి సత్యం రెండురోజుల క్రితం మృతిచెందాడు.ఈవిషయం తెలుసుకున్న వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం రాత్రి సత్యం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తుమ్మల వెంట ఆలపాటి రాంచంద్రప్రసాదు, బండి బాస్కర్, కేవి సత్యనారాయణ, గడ్డిపాటి సత్యం, పోతినేని శ్రీరామ వెంకట్రావు, వలీపాషా, పగడాల రాంబాబు, పానుగంటి చిట్టిబాబు. కక్కిరాల రమేష్, బంధం శ్రీను తదితరులున్నారు.